# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-05-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మన దేశంలోని 26 ప్రదేశాల్లో పాకిస్థాన్ దాడులకు ప్రయత్నించగా సమర్ధవంతంగా తిప్పికొట్టామని విదేశాంగ శాఖ, రక్షణ శాఖ వెల్లడించాయి.**
2. **పాకిస్థాన్ ప్రేరేపిత సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా వ్యాప్తి చేస్తున్న అనేక అసత్య వార్తలను పత్రికా సమాచార కార్యాలయం..పీఐబీ ఖండించింది.**
3. **రాష్ట్రం నుంచి మూడు కొత్త విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు.**
4. **పిఠాపురం నియోజకవర్గంలో తల్లిదండ్రులు లేని పిల్లల భవిష్యత్తు కోసం ప్రతినెలా తన జీతం వెచ్చిస్తానని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ప్రకటించారు.**
5. **అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**

==========================

మన దేశంలోని 26 ప్రదేశాల్లో పాకిస్థాన్ దాడులకు ప్రయత్నించగా సమర్ధవంతంగా తిప్పికొట్టామని విదేశాంగ శాఖ, రక్షణ శాఖ వెల్లడించాయి. భారత్-పాక్ సరిహద్దుల్లో ఘర్షణలపై విదేశాంగశాఖ, రక్షణ శాఖ ఈ ఉదయం ఢిల్లీలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ, సైన్యానికి చెందిన కర్నల్ సోఫియా ఖురేషీ, వాయుసేనకు చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పాల్గొన్నారు. సరిహద్దుల్లో తాజా పరిస్థితులను కర్నల్ సోఫియా ఖురేషి వివరిస్తూ.. క్షిపణులు, యుద్ధ విమానాలు, డ్రోన్లతో పాకిస్థాన్ దాడులు చేస్తోందని.. వాటిని భారత్ ధీటుగా తిప్పి కొడుతోందని తెలియజేస్తూ...

..వాయిస్...25 సెకన్లు

వింగ్ కమాండర్ ఒమికా సింగ్ మాట్లాడుతూ.. పాకిస్థాన్‌లోని మిలిటరీ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని భారత్ దాడులు జరిపిందని వెల్లడించారు. ఆ దేశం అసత్య ప్రచారం చేస్తోందని.. మన వాయు సేన స్టేషన్లకు ఎలాంటి హాని జరగలేదని ఒమికా సింగ్ స్పష్టంచేస్తూ...

..వాయిస్.. 26 సెకన్లు

------------------------

పాకిస్థాన్ ప్రేరేపిత సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా వ్యాప్తి చేస్తున్న అనేక అసత్య వార్తలను పత్రికా సమాచార కార్యాలయం..పీఐబీ ఖండించింది. పాకిస్థాన్ సైన్యం భారత సైనిక స్థావరాన్ని ధ్వంసం చేసినట్టు విడుదల చేసిన వీడియో నకిలీదని పీఐబీ ప్రకటించింది.. మన సైన్యంలో “20 రాజ్ బటాలియన్” అనే యూనిట్ లేదని స్పష్టం చేసింది. ఇక పాకిస్థాన్ సైబర్ దాడి వల్ల భారతదేశం విద్యుత్ గ్రిడ్ 70 శాతం పనిచేయడం ఆగిపోయిందని జరుగుతున్న దుష్ప్రచారం పూర్తిగా సత్య దూరమని వెల్లడించింది. పంజాబ్‌లోని జలంధర్‌లో డ్రోన్ దాడి జరిగిందని పాకిస్థాన్ అనుకూల సామాజిక మాధ్యమాల్లో చూపుతున్న దృశ్యాలు ఒక వ్యవసాయ క్షేత్రంలో జరిగిన అగ్నిప్రమాదానికి సంబంధించిన దృశ్యాలుగా పీఐబీ గుర్తించింది. మన దేశంపై మిస్సైల్ దాడి చేసినట్టుగా ప్రచారం చేస్తున్న వీడియో 2020లో బీరూట్‌లో జరిగిన పేలుడుకు సంబంధించిందని పీఐబీ స్పష్టంచేసింది. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అసత్య వార్తలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పీఐబీ సూచించింది. అలాంటి సమాచారం చూసినప్పుడు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్‌కు సమాచారం అందించాలని కోరింది.

---------------------------

రాష్ట్రం నుంచి మూడు కొత్త విమాన సర్వీసులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడు తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి విజయవాడ–బెంగళూరు మధ్య ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ప్రారంభమవుతాయని నిన్న ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 12వ తేదీ నుంచి విశాఖపట్నం–భువనేశ్వర్ సర్వీసు ప్రారంభం కానుందని ప్రకటించారు. విశాఖపట్నం – అబుదాబి అంతర్జాతీయ సర్వీసు జూన్ 13వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.

---------------------------

పిఠాపురం నియోజకవర్గంలో తల్లిదండ్రులు లేని పిల్లల భవిష్యత్తు కోసం ప్రతినెలా తన జీతం వెచ్చిస్తానని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ప్రకటించారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన 42 మంది అనాథ పిల్లలకు ఆయన తన వేతనం నుంచి ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున మొత్తం 2 లక్షల 10 వేల రూపాయలు ఆర్థికసాయం ప్రకటించారు. జీతంలో మిగిలిన మొత్తాన్ని కూడా వారి బాగోగులు చూసేందుకు ఖర్చు చేస్తానని పవన్ కల్యాణ్ చెప్పారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో నిన్న ఆయన 32 మందికి స్వయంగా సాయం అందజేశారు.

---------------------------

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. అనమయ్య జిల్లా చిన్నమండెం మండలం, బోరెడ్డి గారి పల్లెలోని ఆయన నివాసంలో ఈ రోజు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారిని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజమైన పేదలను గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని వెల్లడించారు. అర్హులకు త్వరలో నూతన పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు మంజూరు చేస్తామని రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.

---------------------------

పారిశ్రామిక రంగంలో పురోగతిని సాధించడానికి అత్యంత నైపుణ్యం గల ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను తయారు చేయడమే తమ లక్ష్యమని కియా ఇండియా కార్ల తయారీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గ్వాంగ్ గులీ తెలిపారు. సాంకేతిక పరిశోధనలు పెంపొందించడమే లక్ష్యంగా ఐఐటీ తిరుపతితో కియా ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి సాంకేతిక పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఆటోమోటివ్, ఇండస్ట్రీయల్ ఇంజనీరింగ్ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు ఒప్పందం దోహదపడుతుందన్నారు. మేకర్స్ ల్యాబరేటరీ ఏర్పాటుతోపాటు ఐదేళ్లలో విద్యామౌలిక సదుపాయాలు, సహకార పరిశోధన కార్యక్రమాలకు మద్దతుగా 35 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టేందుకు అంగీకారం తెలిపామని గ్వాంగ్ గులీ వెల్లడించారు.

-----------------------------

పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యల నేపథ్యంలో దేశవ్యాప్తంగా సముద్రతీర ప్రాంతాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. పోర్టులు, నౌకాశ్రయాల్లో భద్రత పెంచింది. సముద్రజలాల ద్వారా దాడులకు తెగబడే అవకాశం ఉందన్న హెచ్చరికలతో కాకినాడ తీర ప్రాంతాల్లో రెండంచెల భద్రత కల్పించారు. జిల్లా పోలీసులు, కోస్టు గార్డ్ సిబ్బంది, కస్టమ్స్, పోర్టు అధికారులు అప్రమ త్తమై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిరంతరం నిఘా పెంచుతూ తీరంలోని కదలికలను పరిశీలిస్తున్నారు. కాకినాడ యాంకరేజ్, డీప్ వాటర్ పోర్టులో అదనపు భద్రత ఏర్పాటు చేశారు.సముద్రంలో కేజీ బేసిన్ చమురు క్షేత్రాలు ఉన్న నేపథ్యంలో వాటి భద్రతపైనా దృష్టి సారించారు.

-----------------------------

కేంద్రహోంశాఖ హెచ్చరికల నేపథ్యంలో తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈరోజు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తిరుపతి పోలీస్ సూపరింటెండెంట్ హర్షవర్థన్ రాజు, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తిరుపతి విమానాశ్రయానికి ఢిల్లీ నుంచి విమాన రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అలాగే విమానాశ్రంలో ఆక్టోపస్ బలగాలు, సిఆర్‌పిఎఫ్, స్థానిక పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాద సమయాల్లో ఏ విధంగా స్పందించాలో ప్రయాణికులకు అవగాహన కల్పించారు.

-----------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు తిరుమలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఈ రోజు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. తిరుమల నుంచి తిరుపతికి వచ్చే టీటీడీ ఉద్యోగులకు ప్రయాణ సమయంలో భద్రత కల్పించడంలో భాగంగా హెల్మెట్లు పంపిణీ చేయాలని నిర్ణయించామని అన్నారు. గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన కేసీఎన్ హెల్మెట్ల తయారీ సంస్థ అధినేత నవీన్ మొదటి విడతగా సుమారు 5 లక్షల రూపాయల విలువైన 555 హెల్మెట్లు విరాళంగా ఇచ్చారని చెప్పారు. 15 రోజుల్లో మరో 500 హెల్మెట్లు విరాళంగా ఇస్తారని టీటీడీ చైర్మన్ వివరిస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

జాతీయ రక్షణ నిధికి రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఒక నెల వేతనాన్ని విరాళంగా

అందజేశారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా ఈ విరాళాన్ని ఆయన జమ చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మన దేశ సాయుధ దళాలు ఉగ్రవాద నిర్మూలనకు చేస్తున్న పోరాటం ప్రతి భారతీయుడికీ గర్వకారణమని తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న వీర జవాన్లకు సంఘీభావంగా ఒక నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చానని అయ్యన్న పాత్రుడు వెల్లడించారు.

---------------------------

బాపట్ల జిల్లా పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం వద్ద గ్రానైట్ పలకల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలకల కింద నలిగి ముగ్గురు మృతి చెందారు. మార్టూరు నుంచి చిలకలూరిపేట, పర్చూరు మీదుగా గుంటూరు వెళ్తుండగా తిమ్మరాజుపాలెం వద్ద ఈ ఉదయం  ప్రమాదం జరిగింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

=======================